సాక్షి వైఎస్ఆర్ జిల్లా

బుధవారం, 17, మే, 2023



రాజరికానికి దర్పణం.. చరిత్రకు సాక్ష్యం

చారిత్రాత్మక ప్రదేశం గుర్రంకొండ కోట. రాచరికానికి, నవాబులు, బ్రిటిష్ వారి పాలనకు నిలువుటద్దంగా నిలుస్తోంది. -8లో..



గంజాయి స్మగ్లర్లపై దాడులు

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం చేస్తున్న స్మగ్లర్లపై పోలీసులు దాడి చేసి, 10 మందిని అరెస్ట్ చేశారు. -8లో..



మరింత మెరుగైన వైద్య సేవలకు కృషి

ప్రజలకు మెరుగ్గా వైద్య సేవలు అందజేస్తామని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ అన్నారు. -8లో..

న్యూస్‌రీల్

మనులో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కళాశాలలో అడ్మిషన్ల పోస్టర్స్‌ను ఆయన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మే 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్లికేషన్స్ నింపుతామన్నారు. ప్రవేశ రాత పరీక్ష జూన్ 21 మధ్యాహ్నం కడప సెంటర్‌లో ఉంటుందన్నారు. వివరాలకు 93980 83058 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్‌పీజీ-1 చర్చిని సందర్శించిన ఇంగ్లాండ్ బృందం



చర్చి సమావేశంలో ఇంగ్లాండ్ దేశస్తులు, కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ-1 చర్చిని మంగళవారం ఇంగ్లాండ్ దేశానికి చెందిన ది రైట్ రెవరెండ్ గావిన్ అండ్రూ కొలిన్ (బిషప్ ఇన్ ఆక్స్‌ఫర్డ్ డయాసిస్), రెవరెండ్ శారా, రెవరెండ్ జేమ్స్‌లు సందర్శించారు. వారికి చర్చి విశిష్టతను కమిటీ సభ్యులు వివరించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ అబ్రహం ప్రేమ్ చంద్, సెక్రటరీ ఎం.యేసేపు, ట్రెజరర్ ఎస్.సెల్వరాజ్, రెవరెండ్ జీడబ్ల్యూఎస్ జీవన్‌బాబు తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఏపీఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడప (మైనారిటీ బాలురు), వేంపల్లి (మైనారిటీ బాలికలు) గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ముస్లిం, దూదేకుల మైనారిటీ విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మైనారిటీ గురు కుల పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ అబ్దుల్ రసూల్ తెలిపారు. దర ఖాస్తు చేసుకోవడానికి జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాల ని సూచించారు. వివరాలకు 7780179446, 9701133148 సంప్రదించాలన్నారు.

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో డీఎస్సీ 1998లో ఎస్‌జీటీగా క్వాలిఫై అయి మినిమం టైం స్కేల్ కింద పనిచేయుటకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై ఉద్యోగానికి జాయిన్ కాని వారి స్థానాలకు నేడు కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. అలాంటి పోస్టులు జిల్లాలో 14 ఉన్నాయని తెలిపారు. ఈ ఖాళీల భర్తీ కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలోని తదుపరి అభ్యర్థుల జాబితా www.kadapadoe.in లో పొందుపరిచినట్లు డీఈఓ తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు 17వ తేదీ కడపలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్‌గా అనిల్



డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన గతంలో 2020 ఆగష్టు 1 నుంచి 2021 ఆగష్టు 16 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా విధులను నిర్వహించారు. అనంతరం పదోన్నతిపై అడిషనల్ డైరెక్టర్ (మాతా శిశు సంరక్షణ)గా అమరావతిలో విధులను చేపడుతున్నారు. తాజాగా ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా కడపకు వస్తున్నారు. కాగా ఇక్కడ ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా, మాతృ సంస్థ జోనల్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కోటేశ్వరి అడిషనల్ డైరెక్టర్ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ)గా పదోన్నతి లభించడంతో అమరావతికి వెళుతున్నారు.

ఇన్‌చార్జ్ జడ్ఎంఓగా డాక్టర్ నాగరాజు...

జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కోటేశ్వరికి అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించడంతో ఇన్‌ఛార్జ్ జోనల్ మలేరియా అధికారి (జడ్ఎంఓ)గా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు నియమితులయ్యారు. కాగా ఆయన ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌ఓగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి బాధ్యతలు చేపడుతున్నారు.

భూసార పరీక్ష.. రైతుకు రక్ష

- ఆర్‌బీకే నుంచి రెండు చొప్పున జిల్లావ్యాప్తంగా 956 శాంపిల్స్ సేకరణ
- కడప భూసార పరీక్షా కేంద్రంలో ప్రారంభమైన పరీక్షలు
- త్వరలో ప్రతి ఆర్‌బీకే నుంచి 30 శాంపిల్స్ సేకరణ
- సాయిల్ హెల్త్ కార్డులు ద్వారా రైతులకు ఫలితాలు
- ఫలితాలకు అనుగుణంగా పంటల సాగు, ఎరువులు





భూసార పరీక్షా కేంద్రంలో ఏడీ ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కడప అగ్రికల్చర్: అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఎన్నో పథకాలు రైతుల కోసం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. దీంతోపాటు పంట సాగు నుంచి దిగుబడి వరకు అన్నదాతలను అన్ని రకాలుగా ఆదుకుంటూ పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం భూములు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించేందుకు నడుంబిగించారు. తాజాగా భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలను ప్రకటించి అందుకు అనుగుణంగా పంటలసాగు చేసి దిగుబడులు పెంచే యోచన చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఇటీవలే రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, మండల వ్యవసాయ అధికారులకు, అగ్రికల్చర్ డివిజనల్ అధికారులకు జిల్లా కేంద్రంలో శిక్షణను కూడా నిర్వహించారు.

- ప్రస్తుతం ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధి నుంచి రెండు శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు చేసి ఫలితాలను తెలుపనుంది. ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసి ఎరువులు వాడి దిగుబడులను పెంచేందుకు కృషి చేస్తోంది.

వైఎస్సార్ జిల్లా నుంచి...

వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 432 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 956 మంది రైతులకు సంబంధించిన పొలాలలో మట్టి నమూనాలను సేకరించారు. నమూనాలను కడపలోని భూసార పరీక్షా కేంద్రానికి చేర్చారు. వీటికి సంబంధించి ప్రతి రోజు కడప భూసార పరీక్ష కేంద్ర సిబ్బంది పరీక్షలను నిర్వహిస్తున్నారు. వీటి ఫలితాలను త్వరలో రైతు భరోసా కేంద్ర సిబ్బందికి అందించనున్నారు. దీని తర్వాత త్వరలో ప్రతి ఆర్‌బీకే నుంచి 30 శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలను నిర్వహించనున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం...

పంటలసాగులో అధిక దిగుబడులను సాధించాలనే తపనతో చాలామంది రైతన్నలు మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్ల భూమిలోని పోషకాలు నశించి పోతున్నాయి. మట్టి నమూనా పరీక్షలు చేస్తే భూమిలో ఏ మేరకు సూక్ష్మ పోషకాలు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకునే వీలుంటుంది. ఈ మట్టికి సంబంధించి పీహెచ్, ఈసీ, ఆర్గానిక్ కార్బన్, ఫాస్పరస్, నైట్రోజన్, పొటాషియం, సల్ఫర్, బోరాన్, జింకు, ఐరన్, కాపర్, మాంగనీస్ తదితర టెస్టులను నిర్వహిస్తారు. మట్టిలో వాటి సాంద్రత ఏ మేరకు ఉందని పరీక్షిస్తారు. పొటాష్‌ను ఎక్కువగా వాడటం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతాయి. ఫలితంగా జింకులోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

- సూక్ష్మ పోషకాలతోపాటు పీహెచ్(నైట్రోజన్) సేంద్రీయ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. వీటన్నింటినీ పరీక్షించి దానికి అనుగుణంగా ఈ ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డులలో నమోదు చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందచేస్తారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు. అనంతరం ఫలితాలకు అనుగుణంగా పంటలసాగుతోపాటు ఎరువుల వాడకాన్ని చేపట్టే విధంగా చర్యలను చేపట్టనున్నారు.

పంటల సాగుకు..

భూసార పరీక్ష పూర్తి అయిన తర్వాత వాటి ఫలితాల ఆధారంగా రైతులు వారి పొలాల్లో ఏఏ పంటలు సాగు చేయాలి. ఎంత మోతాదులో ఎరువులను వాడాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. దీనికనుగుణంగా రైతులు పంటల సాగు చేసుకుని అధిక దిగుబడులను పెంచుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

రైతులకు ప్రయోజనం..



రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల నుంచి మట్టి నమూనాలు వచ్చాయి. వాటికి సంబంధించిన పరీక్షలను కూడా ప్రారంభించాం. త్వరలో ఫలితాలను కూడా ఆర్‌బీకేలకు అందచేస్తాం. ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసుకోవాల్సి ఉంటుంది.

– లక్ష్మీదేవి, ఏడీఏ, భూసార పరీక్షా కేంద్రం, కడప.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో భూసార పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై జిల్లాస్థాయిలో ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, మండల వ్యవసాయ అధికారులకు, ఏడీఏలకు శిక్షణ కూడా ఇచ్చాం. ప్రతి ఆర్‌బీకే పరిధిలో నుంచి రెండు శాంపిల్స్‌ను సేకరించి భూసార కేంద్రానికి పంపించారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలన్నీ పూర్తికాగానే ఫలితాలను ప్రకటించి పంటలసాగు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రెండవ రోజు ఈఏపీసెట్ ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ ప్రవేశాల కోసం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా రెండవరోజు మంగళవారం ఎంపీసీ విద్యార్థులకు ఈఏపీసెట్ పరీక్షను జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 1485 మంది విద్యార్థులకుగాను 1397 మంది హాజరై 94.07 శాతం హాజరు నమోదయింది. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 1484 మందికిగాను 1402 మంది హాజరై 94.47 శాతం హాజరు నమోదయింది. రెండు సెషన్స్‌కు సంబంధించి 2969 మందికిగాను 2799 హాజరు కాగా 94.27 హాజరు నమోదయింది.

పోస్టల్ శాఖ అభివృద్ధికి కృషి చేయాలి



బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్

కడప వైఎస్ఆర్ సర్కిల్: పోస్టల్ శాఖ అభివృద్ధికి నూతనంగా విధుల్లో చేరే ఉద్యోగులు కృషి చేయాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరుతున్న గ్రామీణ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి రోజ్‌గారి మేళాలో భాగంగా గ్రామీణ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లుగా పదవ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా వీరిని ఎంపిక చేశారన్నారు. నూతన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు విధులను బాధ్యతగా నిర్వహిస్తూ పోస్టల్ శాఖ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏఎస్‌పీలు విజయ్ భాస్కర్, రమ శంకర్, అహ్మద్ హుస్సేన్, ఇన్‌స్పెక్టర్‌లు అమర్‌నాథ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్ల విభేదాలు

రసాభాసగా ఎన్‌టీఆర్ శత జయంతి వేడుకలు



మినీ మహానాడు వేదిక నుంచి బయటకు వెళ్లిపోతున్న మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ఎన్‌టీఆర్ శతజయంతి వేడుకలలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రాయచోటిలో మంగళవారం నిర్వహించిన మినీ మహానాడులో ప్రారంభం నుంచే విభేదాలు బయట పడ్డాయి. ఈలలు, కేకలు, ఫర్నిచర్ ధ్వంసం, తోపులాటలు, తమ నాయకులకు అనుకూలంగా నినాదాలతో సమావేశం మొత్తం అట్టుడికింది. టీడీపీ నేతలు రమేష్‌రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ బాబుల మధ్య నెలకొన్న అసంతృప్తి సెగలు కార్యకర్తల దూషణల పర్వంతో బయట పడ్డాయి. జిల్లాలోని ఆరు నియోజక వర్గాల నుంచి నేతల అనుయాయులు సమావేశానికి వచ్చారు. ఈ క్రమంలో రమేష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ బాబు కూడా వేర్వేరుగా తమ అనుచరులతో చిన్నపాటి బల ప్రదర్శనకు దిగారు. మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పట్టణంలోని తన కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేసుకొని టీడీపీ నేత గంటా నరహరితో కలసి మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికే వేదిక ప్రాంగణంలో తమ నాయకులకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండటంపై రమేష్ కుమార్‌రెడ్డి మైకు ద్వారా వారించారు. అనంతరం సమావేశంలో మైక్ తీసుకొని మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో మైక్ మూగ పోవడంతో పాటు సమావేశం పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లు ఆగిపోయాయి. దీంతో రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు అక్కడున్న సౌండ్ సిస్టమ్‌ను ధ్వంసం చేశారు. మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి అలకపూని తన అనుయాయులతో కలసి మినీ మహానాడును బహిష్కరించారు. ఈ తోపులాటలో రమేష్‌రెడ్డి, ప్రసాద్ బాబు వర్గీయులు కూడా ఒకరికి ఒకరు తోడు కావడంతో నాయకుల మధ్య ఉన్న విభేదాలు బయట పడ్డాయి. ఆ ప్రాంగణం బయట ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవ సాగనీయకుండా సముదాయించారు. తిరిగి మండిపల్లె వేదికపైకి వెళ్లారు. కానీ గొడవ మాత్రం ఆగలేదు. ఇంతలో వేదిక పైన ఏమి జరిగిందో తెలియలేదు కానీ వేదికపై నుంచి రండిరా పోదాం రండి అంటూ మండిపల్లె కిందకు దిగి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. వేదికపై ఉన్న నాయకులు ఎవరూ ఆయనను వారించే ప్రయత్నం చేయలేదు. తరువాత నాయకులు అందరూ మాట్లాడారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మనస్పర్థలు ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలే కానీ ఇలాంటి వేదికలపై ప్రదర్శన చేయకూడదని సూచనలు చేశారు. కార్యక్రమం పూర్తయిన తరువాత రాజంపేట ఇన్‌చార్జి బత్యాల చంగల్‌రాయుడు అనుచరు లు ....జై బీసీఆర్....జైజై బీసీఆర్.. చంగల్ రాయుడి నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేస్తుంటే వేదికపై ఉన్న నాయకులు తలపట్టుకున్నారు.

ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి

పాఠశాల విద్య ఆర్జేడీ వెంకట క్రిష్ణారెడ్డి



పాఠ్యపుస్తకాలను డౌన్‌లోడ్ చేసి విద్యార్థికి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఆర్జేడీ వెంకట క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ మార్తాల వెంకట క్రిష్ణారెడ్డి, జిల్లా సమగ్రశిక్ష అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం కడప ఎంఈఓ పాలెం నారాయణ ఆధ్వర్యంలో నగరంలోని గౌస్‌నగర్, సున్నపురాళ్లమిట్ట, మాసాపేట, ఆకులవీధి, సీకే దిన్నె ప్రాంతాల్లో స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠ్యపుస్తకాలను సెల్‌లో డౌన్‌లోడ్ చేయించడంతోపాటు వాటి ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం 8వ తరగతి పుస్తకాలను సీబీఎస్‌ఈ ద్వారా ప్రభుత్వం రూపొందించిందని, ఈ విద్యా సంవత్సరం 9వ తరగతి పాఠ్యపుస్తకాలను సీబీఎస్‌ఈ ద్వారా రూపొందించడంతో పాటు ఆరు, ఏడు తరగతులకు సంబంధించి స్వల్ప మార్పులు ఉంటాయన్నారు. ఈ - కంటెంట్ ద్వారా వేసవిలో విద్యార్థులు పాఠ్య పుస్తకాలను తరచుగా పరిశీలించడం ద్వారా అకడమిక్ విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం సులభతరం అవడంతోపాటు సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాలెం నారాయణ, మున్సిపల్ మెయిన్ స్కూల్ హెచ్‌ఎం నాగమణి, సీఆర్‌పీ కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక అందజేయాలి

చింతకొమ్మదిన్నె : బడి తెరిచేనాటికి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందాలని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీకేదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక మండల స్టాక్ పాయింట్‌ను వారు పరిశీలించారు. పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి ప్రతి విద్యార్థి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

క్రూసెంటర్ క్లోజ్

- నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్‌కు ఘన చరిత్ర
- వచ్చేనెల 6 నాటికి డెడ్‌లైన్
- తట్టా..బుట్టా సర్దుకుంటున్న లోకో పైలెట్లు
- ఇక గూడ్స్‌రైళ్లు కూడా ఆగవు
- సదరన్ రైల్వేలో 'నందలూరు'ప్రత్యేక గుర్తింపు



ఒకప్పటి నందలూరు రైల్వేకేంద్రం

నందలూరు (రాజంపేట): బ్రిటీషు రైల్వే పాలకుల నుంచి కొనసాగిన ఎంతో ఘన చరిత్ర కలిగిన నందలూరు రైల్వే రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ (మిగిలిన ఏకైక డిపార్టుమెంట్) ఎత్తివేతకు డెడ్‌లైన్ విధించారు. ముందుగా నందలూరుకు మోడర్ రన్నింగ్‌రూం కోటి వ్యయంతో మంజూరు చేశారు. దానిని అర్ధాంతరంగా రద్దుచేశారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్‌స్టాఫ్ డిపో ఏర్పాటు అనుకూలం కాదని చెబుతున్నా గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోలేదని.. వారి అనాలోచిత నిర్ణయాలతో నందలూరు డిపోకు మంగళం పాడారని రైల్వే కార్మిక వర్గాలు చర్చించుకుంటున్నాయి.

6న క్రూసెంటర్ క్లోజ్..

వచ్చేనెల 6న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌ను క్లోజ్ చేయనున్నారు. ఈ మేరకు సంబంధితశాఖ అధికారులకు గుంతకల్ నుంచి సంకేతాలు కూడా వచ్చేశాయి. ఇప్పటికే దశలవారీగా లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, గార్డులను గుంతకల్ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్న డిపోకు తరలించారు. ఇక పూర్తి స్థాయిలో నందలూరు క్రూ సెంటర్‌ను మూసేసేందుకు రంగంసిద్ధం చేశారు.

- రన్నింగ్‌స్టాఫ్ సిబ్బందిని ఇప్పటికే గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు ఎర్రగుంట్ల డిపోకు వెళ్లేలా మానసికంగా సిద్ధం చేశారు. వచ్చే నెల 6 నాటికి నందలూరులో క్లోజ్ చేయనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి లోకోపైలెట్లు, ఏఎల్‌పీ, గూడ్స్‌గార్డులు తట్టా బుట్టా సర్దుకుంటున్నారు. దీంతో నాగిరెడ్డిపల్లె అర్బన్ పంచాయతీలో అద్దె ఇళ్లను ఖాళీ చేసుకుంటున్నారు. ఎర్రగుంటల్లో నివాసం ఉండలేమని వారు అంటున్నారు. కాలుష్యం లేని, తాగునీటి వసతి తదితర సమస్యలు లేని సమీప నగరాల్లో ఉండేందుకు అద్దె ఇళ్లను అన్వేషించుకుంటున్నారు.

నాలుగేళ్లలో..

ఆది నుంచి ఒక పథకం ప్రకారం నందలూరు రైల్వేకేంద్రాన్ని బీజేపీ సర్కారు నిర్వీర్యం చేసుకుంటూ వస్తోందని రైల్వే వర్గాల్లో చర్చ సాగుతోంది. క్రూ సెంటర్ క్లోజ్ నేపథ్యంలో ఆ పార్టీకి రాజంపేట, నందలూరు ప్రాంతీయుల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోంది. హోల్టింగ్, ఉన్న డిపార్టుమెంట్లను ఎత్తివేయడం తదితర వాటిని రైల్వే చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ నందలూరు రైల్వే వైభవం కోల్పోవడానికి నాంది పలికిందని.. ఇప్పుడు బీజేపీ పాలనలో పూర్తిగా గత వైభవంను క్లోజ్ చేశారనే విమర్శలు వెలువడుతున్నాయి.

170 ఏళ్ల తర్వాత నిర్వీర్యం దిశగా నందలూరు..

దక్షిణమధ్య రైల్వే చరిత్రలో గుంతకల్‌కు రైలుమార్గంలేని రోజులలోనే నందలూరుకు రైల్వేమార్గం ఉండేది. సదరన్ రైల్వే(తమిళనాడు)లో కీలక రైల్వే కేంద్రంగా విరాజిల్లింది. వేలాది మంది కార్మికులతో కళకళలాడింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వారు నందలూరులో నివాసాలు ఉండటంతో దేశవ్యాప్త కల్చర్ నందలూరులో కొనసాగింది. ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడంలేదు. ఇక గూడ్స్ రైళ్లు కూడా ఆగకుండా వెళ్లిపోనున్నాయి. ఈ నేపథ్యంలో రన్నింగ్‌రూం, రైల్వే హాస్పిటల్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఎలక్ట్రికల్, రైల్వే ఇనిస్టిట్యూట్ తదితర విభాగాలు కూడా క్లోజ్ కానున్నాయి. ఆ విధంగా 170 ఏళ్ల చరిత్ర కలిగిన నందలూరు బీజేపీ పాలనలో గ్రామీణస్టేషన్‌గా అవతరించనున్నది.

రన్నింగ్‌స్టాఫ్ డిపో క్లోజ్ చేస్తే ..



నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ వచ్చేనెల 6న క్లోజ్ చేయనున్నారు. కళకళలాడే నందలూరు ఇక కళ తప్పనుంది. 170 ఏళ్ల రైల్వేచరిత్ర కాలగర్భంలో కలిసిపోతుంది. గంతకల్ రైల్వేడివిజన్ ఉన్నతాధికారులు నందలూరుపై కత్తికట్టి మరీ నిర్వీర్యం చేస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోంది. ఇక నేరుగా రైల్వేబోర్డులో కదిలిక తీసుకురావాలి. నందలూరు పూర్వవైభవం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది.

– జంబు సూర్యనారాయణ, సర్పంచి, నాగిరెడ్డిపల్లె అర్బన్, నందలూరు

జిల్లాలో రైల్వే అంటే నందలూరు



జిల్లాలో రైల్వే అంటే నందలూరు.. నందలూరు అంటే రైల్వే అన్నట్లుగా కొనసాగింది. జిల్లాలో ఏ రైలు ఎక్కాలన్నా నందలూరుకు వచ్చేవారు. ఇప్పుడు ఏ రైలూ ఆగడం లేదు. ఉన్న విభాగాలను ఎత్తివేసే పరిస్థితులు నెలకొన్నాయి. నేడు నిర్వీర్యదిశగా పయనించడం బాధాకరం. నందలూరు రైల్వే కేంద్రానికి పూర్వవైభవానికి కలిసికట్టుగా కృషిచేయాలి.

– కమాల్‌బాష, రిటైర్డ్ లోకోపైలెట్, నందలూరు

ప్రతిష్టాత్మకంగా లైఫ్ కార్యక్రమం



అటవీప్రాంగణంలో చెత్త తొలగిస్తున్న అటవీ అధికారులు

బి.కొత్తకోట: పర్యావరణహిత జీవనశైలి కోసం చేపట్టిన లైఫ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్నామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (అనంతపురం రేంజి) ఎస్.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ సముదాయంలో లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలోని చెత్త, ప్లాస్టిక్‌ను స్వయంగా తొలగించి పరిశుభ్ర పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బంది కలగని అంశాలపై ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అన్నమయ్య, శ్రీపుట్టపర్తి, అనంతపురంజిల్లాల్లో దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన అంశాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఏఏ అంశాలు పర్యావరణానికి విఘాతం కలిగిస్తాయి, ఏఏ అంశాలు పర్యావరణ హితం తెలిపేలా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల దాక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, బీటు, సహాయ బీటు అధికారులు పాల్గొన్నారు.

రాజరికానికి దర్పణం.. చరిత్రకు సాక్ష్యం

- గుర్రంకొండ కోట.. విశేషాల కలబోత
- అన్నమయ్య జిల్లాకు మణిహారం
- కర్ణాటక నుంచీ పర్యాటకుల రాక

గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా) : వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు చూడదగిన చారిత్రాత్మక ప్రదేశం గుర్రంకొండ కోట. రాచరికానికి, నవాబులు, బ్రిటిష్ వారి పాలనకు నిలువుటద్దంగా నిలుస్తోంది. అన్నమయ్య జిల్లాకు నడిబొడ్డున మణిహారంలా విరాజిల్లుతోంది. 14వ శతాబ్దం నుంచి ఈ కోటను పలు వంశాలకు చెందిన రాజులు, నవాబులు పాలించారు. 200 ఏళ్ల పాటు రాచరిక పాలనా వ్యవస్థకు కేంద్రంగా, జాగీరుగా, వ్యాపార వాణిజ్యాలకు, జమిందార్ల నిలయంగా ఉండేది. ముఖ్యంగా కడప నవాబు పాలనలో పేరుగాంచింది. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి దేవాలయాలు ఉన్నాయి. మైసూరు రాజు టిప్పుసుల్తాన్ బాల్యం, విద్యాభ్యాస్యం ఇక్కడే గడిచింది. చివరగా బ్రిటిష వారితో ఇక్కడ రాజరిక పాలనకు తెరపడింది. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ఈ కోటలో ఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఎంతో ఆకట్టుకునే కట్టడాలు ఉన్నాయి. దీని మొత్తం విస్తీర్ణం 700 ఎకరాలు ఉంటుంది. దీన్ని తిలకించడానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు.

కోట ముఖద్వారం

గుర్రకొండను రాజులు పరిపాలించే కాలంలో కొండ చుట్టూ కోటగోడలను నిర్మించారు. కోటగోడల చుట్టూ కందకాలు తవ్వారు. ఈ కందకాల్లో నీటిని నింపేవారు. శత్రువులు కోటగోడలు ఎక్కకుండా.. ఆ నీటిలో మొసళ్లను వదిలేవారు. అలాంటి కోటకు ముఖద్వారాన్ని నిర్మించారు. ఈ ద్వారం నుంచే ఎవరైనా లోపలికి ప్రవేశించే వారు.




టిప్పుసుల్తాన్ చదవుకున్న పాఠశాల యూసుఫ్‌సాహేబ్ తకియా

యూసూఫ్ సాహేబ్ తకియా

గుర్రంకొండ పాలకులు టిప్పుసుల్తాన్ చదవుకొన్న పాఠశాలే యూసూఫ్‌సాహేబ్ తకియా. (తకియా అంటే పార్సీ భాషలో పాఠశాల అని అర్థం). అందరితోపాటు టిప్పుసుల్తాన్ తన గురువు షాకమాల్ దగ్గర ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొన్నాడు. గుర్రంకొండ పట్టణంలోని షాకమాల్ దర్గా పక్కనే ఈ పురాతన పాఠశాల భవనం ఉంది.

షాకమాల్ దర్గా

మైసూరు పాలకులు, అప్పటి గుర్రంకొండ కోట



గుర్రంకొండ కోట ముఖ చిత్రం

పాలకులు అయిన టిప్పు సుల్తాన్ ఆస్థాన గురువు షాకమాల్ దువ్వమ్. ఆయన ఈజిప్ట దేశం నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన గొప్పతనం విన్న అప్పటి మైసూర్ పాలకులు హైదరాలీ తన కుమారుడు టిప్పుసుల్తాన్‌ను గుర్రంకొండలోని అతని మేనమామ మీర్‌రజా ఆలీఖాన్ వద్ద ఉంచి షాకమాల్ దగ్గర విద్యాబుద్ధులు నేర్పించారు. తదనంతర కాలంలో షాకమాల్ దువ్వమ్‌ను టిప్పుసుల్తాన్ గురువుగా నియమించారు. షాకమాల్ సమాధినే ఇక్కడ గొప్ప దర్గాగా ప్రజలు కొలుస్తారు. ఇది గుర్రంకొండ పట్టణంలో ఉంది.

షాహజాదీ మసీదు

టిప్పు సుల్తాన్ కాలంలో రాజవంశీయుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మసీదు ఇది. పూర్తిగా రాతితోనే నిర్మించడం దీని ప్రత్యేకత. ఎక్కడా కూడా ఇతర నిర్మాణ వస్తువులు (ఇసుక, సిమెంటు, కంకర) లాంటివి వినియోగించకుండా పూర్తి స్థాయిలో రాతితోనే నిర్మించారు. ప్రస్తుతం దీన్ని ఆధునికీకరించారు. ఇలాంటివి కోట పరిసరాల్లో మరో రెండు ఉన్నాయి.

ఇంకా చూడదగిన విశేషాలు

- కొండపైన కోట బురుజులు, పురాతన కట్టడాలు, పురాతన ఇళ్లు ఉన్నాయి. అక్కడికి చేరుకోవడానికి మెట్లమార్గం కూడా ఉంది.
- కోటలో శిథిలావస్థకు చేరుకొన్న అలనాటి ఆస్పత్రి భవనం ఉంది.
- శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, టిప్పుసుల్తాన్ కాలం నాటి ఈద్గాలు ఉన్నాయి.
- కోట నుంచి పది కిలోమీటర్ల దూరంలో తరిగొండ గ్రామంలో ప్రముఖ రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది.
- కోట నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సంతాన ప్రదాయిని చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మకొండ దేవాలయం ఉంది.
- వీటితోపాటు ఇంకా ఎన్నో విశేషాలు గుర్రంకొండ కోటలో చూడవచ్చు.

ఇలా వెళ్లొచ్చు

- అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో 38 కిలోమీటర్ల దూరంలో కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ఉంది.
- తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో వాల్మీకిపురంలో దిగాలి. అక్కడి నుంచి గుర్రంకొండ 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇదే మార్గంలోనే తరిగొండ వెంగమాంబ ఆలయమున్న తరిగొండ గ్రామం ఉంది.
- తిరుపతి నుంచి నేరుగా అయితే 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- చిత్తూరు నుంచి నేరుగా అయితే 125 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- మదనపల్లె నుంచి కడపకు వెళ్లే మార్గంలో అయితే మదనపల్లె నుంచి 33 కిలోమీటర్ల దూరం ఉంటుంది.



కోట ముఖద్వారం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం



శ్రీకృష్ణదేవరాయులు నిర్మించిన శ్రీ నరసింహస్వామి దేవాలయం

గుర్రంకొండ కోటను విజయనగర రాజులు పాలించే కాలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అప్పటి పాలకులు శ్రీకృష్ణ దేవరాయులు కోటలోని కొండపైభాగంలో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. రంగిన్ మహల్‌కు దగ్గరలో కొండపైకి చేరుకునే మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. శిల్పకళా సౌందర్యంతో స్తంభాలు ఇట్టే ఆకట్టుకొంటాయి. అన్ని దేవాలయాలు తూర్పు ముఖంగా నిర్మిస్తే.. దీన్ని పశ్చిమముఖంగా కట్టడం విశేషం. ఇక్కడి నుంచి చూస్తే గుర్రంకొండ పట్టణంతోపాటు పరిసర గ్రామాల పచ్చటి పొలాలు, రాయల కాలం నాటి చెరువులు కనిపిస్తాయి.

మగ్బీరా

కోట పక్కనే మగ్బీరా ఉంది. పురాతన మహమ్మదీయుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బీరా అంటే సమాధి. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజాఆలీఖాన్ పాలించే వారు. ఆయన మృతి చెందిన తరువాత సమాధిని మగ్బీరాగా నిర్మించారు. ఇక్కడి డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతిధ్వనించడం (రీసౌండ్) విశేషం.



మీర్ రజాఆలీఖాన్ సమాధి మగ్బీరా

రంగిన్‌మహల్



రంగిన్‌మహల్ ముందు వైపు నుంచి కనిపిస్తున్న రెండు అంతస్తులు

గుర్రంకొండ కోటలో చూడదగిన ముఖ్య ప్రదేశం రంగిణీ మహల్. ఎంతో పురాతన రాజభవనం ఇది. ముందు వైపు నుంచి రెండు అంతస్తులుగానూ, వెనకవైపు నుంచి మూడు అంతస్తులుగాను కనిపించడం దీని ప్రత్యేకత. ఎన్నో గదులు, ఓ గదిలో భవనం లోపలి నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రురాజులు దండెత్తినప్పుడు ఈ మార్గం గుండా కోట బయటకు వెళ్లేందుకు ఈ సొరంగం ఒక మార్గంగా ఉండేది. పురాతన మెట్లు, సమావేశపు గదులు ఉన్నాయి.



వెనుకవైపు నుంచి కనిపిస్తున్న మూడు అంతస్తులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీడీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కనున్న పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతను అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించాడా? ఇంకా ఏవైనా కారణాలున్నాయా? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కడప రిమ్స్ పీఎస్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి వయస్సు 45-50 ఏళ్లు ఉండవచ్చు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

రిమ్స్ మార్చురీలో..



కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వుంది. అతన్ని ఈనెల 14న రాత్రి 11 గంటల సమయంలో 108 వాహనంలో రిమ్స్‌కు తీసుకుని వచ్చారు. అప్పటికే మృతి చెందాడు. పేరు ఎం.మస్తాన్ (58)గా నమోదు చేశారు. ఈ నెల 15న రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని వుంచారు. ఎవరైనా అతని ఆచూకీ తెలిసిన వారు తమను నేరుగా సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

ఆచూకీ గుర్తించరూ..



వేంపల్లె : మండల పరిధి వీరన్నగట్టుపల్లె పొలాల్లోని మామిడి తోటల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆ మామిడి తోట యజమాని పోలీసులకు సమాచారం అందించగా.. వెళ్లి పరిశీలించారు. వారం రోజుల క్రితం చనిపోయినట్లు భావిస్తున్నారు. అతని వయసు 40-50 ఏళ్ల మధ్య ఉండవచ్చు. బట్ట తలతో గుర్తు పట్టలేని విధంగా మృతదేహం ఉంది. నలుపు రంగ ప్యాంటు, స్కైబ్లూ కలర్ షర్టు, రెడ్ బ్లాక్ కలర్ బెల్టు ధరించాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వేంపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. అలాగే 9121100550, 9440938046 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

గంజాయి స్మగ్లర్లపై దాడులు

- 10 మంది అరెస్ట్
- 22.3 కిలోల గంజాయి స్వాధీనం

కడప అర్బన్ : జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం చేస్తున్న స్మగ్లర్లపై పోలీసులు దాడి చేసి, 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22 కిలోల 300 గ్రాముల గంజాయి, ఏడు సెల్‌ఫోన్‌లు, ఆటో, స్కూటీ, మోటార్ సైకిల్, రూ.48,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఉన్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకం చేస్తున్న కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన పఠాన్ అఫ్జల్‌ఖాన్, మాసాపేటకు చెందిన పాణ్యం అశోక్ కుమార్, తారకరామనగర్‌కు చెందిన పూలరాజేష్, అతని భార్య పూల సరస్వతి, పూల నాగవేణి, గౌస్‌నగర్‌కు చెందిన షేక్ సయ్యద్, మాసాపేటకు చెందిన మున్నంగి వర్ధన్, రాజారెడ్డివీధికి షేక్ మహబూబ్‌బాషా, ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన ఎం.జయకుమార్, రమేష్‌ను కడప టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 22 కిలోల 300 గ్రాముల గంజాయి, ఏడు సెల్‌ఫోన్‌లు, ఒక ఆటో, ఒక స్కూటీ, ఒక మోటార్ సైకిల్, రూ. 48,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, కడప డీఎస్పీ ఎం.డీ షరీఫ్, ఆర్ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రాజా ప్రభాకర్, కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐలు యు.వై.జయరాములు, సంజీవరాయుడు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడంతోపాటు నగదు రివార్డులు అందజేశారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

పి.డి చట్టం ప్రయోగిస్తాం

గంజాయిని దాచినా, కొన్నా, అమ్మినా, అక్రమ రవాణా చేసినా, అందుకు సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఇటీవలి కాలంలో దాదాపు 50 మందికి పైగా గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పదేపదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై పి.డి.యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏడుగురు స్మగ్లర్లపై పి.డి చట్టం ప్రయోగించామన్నారు. నిందితులకు ఎవరైనా సహకరిస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి, హిస్టరీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. గంజాయిని వినియోగిస్తున్న వారికి రిహాబిలిటేషన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా వుంచామన్నారు. ప్రజలు గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100 లేదా తన ఫోన్ నంబర్ 94407 96900కు ఇవ్వాలన్నారు. సూచన, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా వుంచుతామని వివరించారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

రైల్వేకోడూరు : జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్ష సంపద పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, దిశ పోలీస్‌స్టేషన్ అండగా నిలవాలని సూచించారు. ఏ కేసులు ఏ కోర్టుల పరిధిలో ట్రయల్ జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కేసుల తీవ్రతను బట్టి త్వరితగతిన పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. కేసుల విచారణకు చేపట్టాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘనలపై నమోదైన కేసులను సమీక్ష చేశారు. రౌడీల కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదం మోపాలని సూచించారు. అంతకు ముందు ఎస్పీ గంగాధర్ రావుకు డీఎస్పీ చైతన్య, ఎస్సైలు మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు సిద్ధం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను అన్ని పాఠశాలల్లో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మన బడి నాడు-నేడు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో నాడు-నేడు ఫేస్-2 పనుల పురోగతిపై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు

జిల్లాలో డెంగీ నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగీ వ్యాధిని ఎక్కడికక్కడ నిర్మూలించేందుకు సంబంధిత ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మెప్మా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి పి.మనోరమ, జెడ్ఎంఓ కె.కోటేశ్వరి, ఇతర మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వివిధ సంస్థలు, దుకాణాలు, భవన నిర్మాణ సంస్థలు, ఇటుకల బట్టీల యాజమాన్యాలు తమ వద్ద పని చేసే కార్మికులకు వడదెబ్బ తగలకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఎండలో తిరగకుండా చూడాలని పేర్కొన్నారు. తలకు టోపి ధరించేలా చూడాలని, కార్మికుడు వడదెబ్బకు గురైతే తగిన వైద్యసేవలు అందించాలని, నలుపు రంగు దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించకుండా చూడాలన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి కూలీల చేత ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు పని చేయించుకోవాలన్నారు. పెరిగిన ఎండల నేపథ్యంలో తమ వద్ద పని చేసే వారి పట్ల యాజమాన్యాలు అన్ని జాగ్రత్తలు పాటించేలా చూడాలని ఆయన కోరారు.

మరింత మెరుగైన వైద్య సేవలకు కృషి

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాలల నుంచి ప్రజలకు అందించే వైద్య సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ అన్నారు. గత వారంలో విజయవాడలో డీఎంఈ, అడిషనల్ డీఎంఈ, అన్ని ప్రభుత్వ కళాశాలలు, వైద్యశాలల ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి హాజరైన రిమ్స్ అధికారులు మంగళవారం కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో అన్ని విభాగాల హెచ్ఓడీలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి, నిరంతరం మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రతి డాక్టర్, సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యుల, అధికారుల పనితీరుపై పర్యవేక్షణను ఆయా విభాగాల హెచ్ఓడీలే చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలన్నారు. రోగులకు మైక్రో బయాలజీ, ఫెథాలజీ, బయోకెమిస్ట్రీ, రేడియాలజీ విభాగాలకు సంబంధించిన పరీక్షలను ఎప్పటికపుడు నిర్వహించాలన్నారు. వారికి ఇచ్చే రిపోర్ట్‌ల ఆధారంగా వైద్యులు అవసరమైతే ఏరోజుకారోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాలతోపాటు ఇతర విభాగాల్లో ఓపీ, ఐపీ సేవలను విస్తృతంగా అందించాలన్నారు. ప్రధానంగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గైనకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీసుశీల మాట్లాడుతూ తమ విభాగంలో కాన్పులకు వచ్చే రోగులకు, ఇతర స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధించిన సేవలను విస్తృతంగా చేస్తున్నామన్నారు. తమకు వైద్యుల, సిబ్బంది కొరత ఎక్కువగా వుందన్నారు. పడకల సంఖ్య కూడా పెంచాలని సూచించారు. వైద్యుల, సిబ్బంది పనిసమయాలను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తుంటామని ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. పనితీరును మెరుగుపర్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల హెచ్ఓడీలు, వైద్యులు, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ



సమావేశంలో పాల్గొన్న వైద్యులు, హెచ్ఓడీలు